


అవి నిజంగా రామనాథానికి దుర్దినాలు.

అప్పులు అందరూ చేస్తారుగాని, రామనాథం తాను తీసుకున్న అప్పులకి వడ్డీలు కట్టడానికి అప్పులు చేస్తున్నాడు. వచ్చే జీతానికీ, అవుతున్న ఖర్చులకీ సంబంధం లేకపోవడంతో భయం భయంగా రోజులు గడుపుతున్నాడు అతను.

అతనికి పరీక్ష పెట్టినట్లుగా ఆ నెల ఇరవై రెండవ తారీకున వచ్చిపడ్డారు బంధువులు. ఒకళ్ళు గాదు యిద్దరు గాదు. నలుగురు. అసలే యింట్లో సరుకులు నిండుకున్నాయి. ఒకటో తారీకుకోసం ఎదురుచూస్తున్న సమయంలో వచ్చిన బంధువర్గాన్నిచూసి ఏంచెయ్యాలా అని రామనాథం, అతని భార్యా సతమత మయిపోయారు.

ఇంతలో రామనాథానికి ఒక చిన్న ఆలోచన వచ్చింది. ''సుశీలా! నీ వాచీ బాగు చేయించాలన్నావుగా యిలా తే'' అన్నాడు.

''ఇప్పుడెందుకండీ! నెలాఖరులో డబ్బులేకుండా వుంటే ఈ వాచి రిపేరు ఎందుకు? తర్వాత యివ్వవచ్చు'' అంది సుశీల.

''అదికాదోయ్! ఇప్పుడిస్తే మళ్ళా ఒకటవ తారీకుకి తిరిగి వస్తాడు.'' అంటూ రామనాథం ఆ వాచీ తీసుకుని బయలు దేరాడు.

అతను వెళ్ళినది వాచీ రిపేరుషాపుకి కాదు. మార్వాడీ వీధికి. ఆ వీధిలో ఎక్కువమంది మార్వాడీలు వున్నారు. వస్తువులను తాకట్టుగా వుంచుకుని డబ్బు అప్పు యివ్వడం వాళ్ళ వృత్తి. కాదు వ్యాపారం.

ఇలాంటి పని అలవాటులేని రామ

నాధం భయంగానే ఒక మార్వాడీ కొట్టు ముందు నిలుచున్నాడు.

ఇతని వాలకం కనిపెట్టి "ఏమి సార్! డబ్బు కావాలా? రండి" అంటూ ఆహ్వానించాడు మార్వాడీ

'అవును' అంటూ అక్కడున్న కుర్చీలో కూలబడ్డాడు రామనాధం తెల్లటి దుప్పటి పరిచిన పరుపుమీద కూర్చున్నాడు మార్వాడీ మనిషి మహతెల్లగా వున్నాడు. అతని మెడలో బంగారుగొలుసు మెరుస్తోంది ఒక పక్కన పెద్ద యినప్పెట్టె. మరో ప్రక్కన త్రాసు వుంది.

"ఏం తెచ్చారు?' అన్నాడు.

జేబులోంచి వాచి తీసియిచ్చాడు రామనాధం.

"ఎంత కావాలి?" అన్నాడు మార్వాడీ మళ్ళా

"యాభై రూపాయలు కావాలి."

కాసేపు వాచీని పరీక్షగా చూసి పరుపు మీదకి అటువైపుకి వంగి బీరువాలోంచి డబ్బుతీసి 43-75 రామనాధం చేతిలో పెట్టాడు అతను.

ఆశ్చర్యపోతూ "యిదేమిటి?" అన్నాడు రామనాధం.

"అవునండీ! వందకి నెలకి పన్నెండున్నర వడ్డీ. అంచేత 50 కి 6-25 అది తగ్గించి మిగిలింది యిచ్చేను" అన్నాడు మార్వాడీ తెల్లగా నవ్వుతూ

ఓరి దుర్మార్గుడా అని మనసులో అనుకుని. అన్యాయం అని పైకి అనబోయి అవసరం తనది కాబట్టి ఆ డబ్బు. రసీదు తీసుకుని బయటపడ్డాడు రామనాధం

ఇంటికి వచ్చిన బంధువులు చిత్రమైన వాళ్ళు 'హైదరాబాదులో టాక్సీ ఎక్కి. చార్మినారు చూడడానికి వెళ్ళాం తెలుసా' అనీ. అక్కడ ఆటోరిక్షాలు తెగ తిరుగుతూవుంటాయి రెండు ఆటోరిక్షాల్లో వెళ్ళి గోల్కొండ చూశాం" అనీ వున్న దానికి రెండింతలు తమ ఊరివాళ్ళకి చెప్పడంకోసం ఎంతో హడావిడిగా తిరిగారు వాళ్ళు. వాళ్ళ గొప్పలు దేముడెరుగు కాని మధ్యలో రామనాధం పని కీమమంది!

వాళ్ళ ధర్మమా అని వచ్చిన చుట్టాలు 28 తారీకు సాయంత్రం రైలెక్కారు.
7 వ తారీకునాడు సాయంత్రం

మామూలుగానే యింటికి వచ్చాడు రామనాధం. ఇంట్లో ఎలావున్నా ఒంట్లో ఎలావున్నాకూడా తను ఆఫీసునుంచి రాగానే చిరునవ్వుతో ఎదురువచ్చే శ్రీమతి కనిపించలేదు

కారణం ఏమిటా అనుకుంటూ లోపలికి వెడితే పాప పడుకున్న మంచం ప్రక్కన కూర్చొనివుంది సుశీల.

"ఏం సుశీలా ఏమయింది?" అంటూ దగ్గరకు వెళ్ళాడు రామనాధం.

"అమ్మా ఒళ్ళు వేడిగావుంది చూడనే అంటూ స్కూలునుంచి వచ్చింది పాప. చూద్దును గదా ఒళ్ళు కాలిపోతోంది. వెంటనే డాక్టరుదగ్గరకు తీసుకెళ్ళాను. ఆయన మందులు రాసిచ్చారు" అంటూ చీటీ అందించింది సుశీల.

"అలాగా! కంగారుపడకు. ఇప్పుడే వెళ్ళి మందులు తీసుకువస్తాను" అంటూ